పండుగలు ఐక్యతను పెంచుతాయి

● కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ● ముగిసిన అంబర్‌పేట బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన ఉత్సవాలు ● పండుగ వాతావరణాన్ని తలపించిన అంబర్‌పేట పరిసరాలు




బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన వేడుకల్లో భారీగా హాజరైన భక్తులు




బొడ్రాయి వద్దకు బోనంతో వస్తున్న మాజీ కార్పొరేటర్ పద్మావతిరెడ్డి, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు శంభుల ఉషాశ్రీకాంత్‌గౌడ్



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు



అంబర్‌పేట బొడ్రాయిని దర్శించుకుంటున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

అంబర్‌పేట: అంబర్‌పేటలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన ఉత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి. అంబర్‌పేట మహంకాళి ఆలయానికి చెందిన బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన ఉత్సవాలు నాలుగు రోజులుగా అంగరంగ వైభవంగా సాగాయి. అంబర్‌పేటలో గురువారం గ్రామీణ పండుగ వాతావరణం ఆవిష్కృతమయ్యింది. అంబర్‌పేట పరిసర ప్రాంతాల ప్రజలు బోనాలతో బొడ్రాయి వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆడబిడ్డలకు ఒడిబియ్యాలు పోశారు.

ఈ వేడుకలకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబర్‌పేట మహంకాళి భక్తులకు కొంగు బంగారమని అన్నారు. పండుగలు ఆధ్యాత్మిక వాతావరణంతో పాటు ఐక్యతను పెంపొందించడానికి దోహదపడతాయని అన్నారు. ఈ వేడుకలకు కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు, కార్పొరేటర్లు బి.పద్మావెంకట్ రెడ్డి, విజయకుమార్‌గౌడ్, కన్నె ఉమారమేశ్ యాదవ్ హాజరై బొడ్రాయిని దర్శించుకున్నారు. ఈ వేడుకలను నిర్వాహకులు దుర్గ ప్రసాద్‌రెడ్డి, పి.జ్ఞానేశ్వర్‌గౌడ్, గడ్డం లక్ష్మణ్‌గౌడ్, వై.శంకర్‌గౌడ్, రంగంపల్లి రాజు, మల్లికార్జున్‌గౌడ్, సుధాకర్, కిషోర్, గడ్డం శ్రీధర్‌గౌడ్, గిరిధర్‌గౌడ్, శ్రీనివాస్‌ముదిరాజ్ తదితరులు పర్యవేక్షించారు.

కాళీపట్నం రామారావు నేటి రచయితలకు స్ఫూర్తి

చిక్కడపల్లి: జీవితం చివరి వరకూ తెలుగు కథ ఉన్నతి తెలిపేందుకు తపించిన కాళీపట్నం రామారావు నేటి రచయితలకు స్ఫూర్తి అని ప్రముఖ కళాకారుడు రోసిరెడ్డి అన్నారు. ఆయన నిరంతర కృషి జాతీయ స్థాయిలో తెలుగు కథను నిలిపిందన్నారు. గురువారం సాయంత్రం త్యాగరాయ గానసభలో ప్రముఖ కథా రచయిత కాళీపట్నం రామారావు శత జయంతి సమావేశం జరిగింది. గానసభ అధ్యక్షుడు వీఎస్ కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించి మాట్లాడారు. ఆయన రాసిన 'యజ్ఞం'కథ దేశవ్యాప్తంగా చర్చకు దారితీసిందన్నారు. ఆయన ఆలోచనా విధానం మార్క్సిజం, మానవతా వాదం అని చెప్పారు. ఆయన శ్రీకాకుళంలో తన సంపాదన అంతా వెచ్చించి కథా కుటీరం నెలకొల్పారని తెలిపారు.



కాళీపట్నం రామారావు జయంతి సభలో మాట్లాడుతున్న రోసిరెడ్డి, జనార్దనమూర్తి

చెట్లను రక్షించలేనప్పుడు కొత్తవి నాటడం ఎందుకు?

- ఈపీడీసీ అధ్యక్షుడు ఎస్పీహెచ్ రంగయ్య
- నగరంలో పచ్చదనం విధ్వంసం జరుగుతోందని ఆవేదన

కాచిగూడ: నగరంలో హరిత విధ్వంసం తీవ్రస్థాయిలో జరుగుతోందని.. కొమ్మల పేరుతో చెట్లను అడ్డంగా నరికివేస్తున్న విద్యుత్ అధికారులు, కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(ఈపీడీసీ) వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్పీహెచ్ రంగయ్య డిమాండ్ చేశారు. గురువారం నారాయణగూడలోని కౌన్సిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. నగరంలో మొక్కలు నాటడం, కొట్టివేయడం కొంత మంతికి ఉపాధి మార్గం అయ్యిందన్నారు. దాని వల్ల పర్యావరణానికి ఎలాంటి మేలు జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కాచిగూడ, బర్కత్‌పుర, నారాయణగూడ, హిమాయత్ నగర్, హైదర్‌గూడ, నల్లకుంట తదితర ప్రాంతాల్లో చెట్ల కొమ్మలతో పాటు చెట్లను నరికివేస్తూ ప్రకృతిని విధ్వంసం చేస్తున్నారన్నారు. చెట్లను రక్షించలేనప్పుడు కొత్తవి నాటడం ఎందుకని ఆయన ప్రశ్నించారు. 'వాల్టా చట్టం'ప్రకారం పోలీసులు చర్యలు తీసుకునే అవకాశం ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు.

వైభవంగా అయ్యప్ప మహాపడి పూజ

ముషీరాబాద్: అయ్యప్పస్వామి నామ స్మరణతో హరినగర్ పరిసరాలు మార్మోగాయి. బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ గడ్డం నవీన్ ఆధ్వర్యంలో గురువారం అయ్యప్పస్వామి మహాపడి పూజ జరిగింది. ఈ పడిపూజకు కార్పొరేటర్ సుప్రియనవీన్‌గౌడ్ హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. భజన మండలి ఆలపించిన భక్తిగీతాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ పూజలో నాయకులు జయసింహ, ఎమ్మెన్ శ్రీనివాస్, ఎర్రోళ్ల సతీష్, స్వామి, రాకేష్ స్వామి, రాము తదితరులు పాల్గొన్నారు.



హరినగర్‌లో జరిగిన పడిపూజలో భక్తులు

రేపు హైదరాబాద్ కలెక్టరేట్‌లో బహిరంగ విచారణ

మారేడ్‌పల్లి తహసీల్దార్ భీమయ్య గౌడ్

అడ్డగుట్ట: ఈనెల 23న లక్డీకపూల్‌లోని హైదరాబాద్ కలెక్టరేట్‌లో తెలంగాణ వెనకబడిన తరగతుల కమిషన్ ఆధ్వర్యంలో బహిరంగ విచారణల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మారేడ్‌పల్లి మండల తహసీల్దార్ భీమయ్య గౌడ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో సామాజికంగా, విద్యాపరంగా, వెనుకబడిన తరగతుల పరిస్థితులను తెలుసుకుని వారి అభ్యున్నతికి కమిషన్ చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. వెనుకబడిన తరగతుల ప్రజలు హాజరై తమ అభ్యర్థనలు, వినతులు, సలహాలు, సూచనలు కమిషన్ చైర్మన్ నిరంజన్‌తో పాటు కమిటీ సభ్యులకు విన్నవించుకోవాలని సూచించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.



చుక్కా రామయ్యకు శుభాకాంక్షలు

నల్లకుంట: హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ తన గురువు, మాజీ ఎమ్మెల్సీ, ప్రముఖ విద్యావేత్త, ఐఐటీ చుక్కా రామయ్యకు గురువారం ఫోన్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈనెల 27న హైదరాబాద్‌కు వస్తున్నానని.. రాగానే వచ్చి కలుస్తానని దత్తాత్రేయ చెప్పారని చుక్కా రామయ్య మీడియాకు తెలిపారు.

మర్యాదపూర్వక కలయిక



చిక్కడపల్లి: వడ్డెర ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్ట్ చైర్మన్ జెరిపిటి సత్యనారాయణ, వైస్‌చైర్మన్ ఎత్తరి అంతయ్య గురువారం రాష్ట్ర బీసీ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. బీసీలకు రావాల్సిన అన్ని సంక్షేమ పథకాలను అందే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఓర్సు కృష్ణ, ఆల్ ఇండియా ఎస్టీ ఎంప్లాయీస్ ప్రధాన కార్యదర్శి పీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని బాలుడి మృతి



ఆదిత్యరెడ్డి మృతదేహం

కాచిగూడ: రైలు ఢీకొని బాలుడు మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం... కర్నాటక బీదర్ ప్రాంతానికి చెందిన ఆదిత్యరెడ్డి (16) మలక్‌పేట - డబీర్‌పుర రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై పోక్సో కేసు

వెంగళరావునగర్: మైనర్ బాలికను వేధిస్తున్న యువకుడిపై మధురానగర్ పీఎస్‌లో పోక్సో కేసు నమోదైంది. పోలీసుల సమాచారం మేరకు... జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఓ ప్రాంతంలో 15 ఏళ్ల బాలిక తన పేరెంట్స్‌తో కలిసి ఉంటుంది. కొంతకాలం కిందట ప్రవీణ్ అనే యువకుడు రహమత్‌నగర్‌లో నివాసం ఉండేవాడు. ఆ సమయంలో యువకుడికి ఆ బాలిక ఇన్‌స్టాగ్రాంలో పరిచయం అయింది. స్నేహంగా ఉంటూ ఇన్‌స్టాగ్రాం అకౌంట్, ఫోన్ నెంబర్ తీసుకున్నాడు. కొద్దిరోజుల తర్వాత తనను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకోవాలని బాలికను వేధించడం ప్రారంభించాడు. ఇటీవల అతను కర్నూలు జిల్లాకు వెళ్లాడు. అయినా ఆ బాలికను వేధిస్తూనే ఉన్నాడు. ప్రవీణ్ వేధింపులు తాళలేక బాలిక మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది.

కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి



సాక్షి,సిటీబ్యూరో: జలమండలి ఎస్టీపీల్లో పని చేసే కార్మికులకు రామానుజ సేవా ట్రస్ట్, జనహిత సేవా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో కిమ్స్ ఆసుపత్రి సహకారంతో అంబర్‌పేట్ ఎస్టీపీ ప్రాంగణంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. గురువారం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జలమండలి ఎండీ మాట్లాడుతూ... కార్మికులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించిన ట్రస్టులను ఆయన అభినందించారు. ఈ శిబిరంలో దాదాపు 300 మంది కార్మికులకు బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, ఈసీజీ తదితర పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఎస్టీపీ ప్రాంగణంలో ఎండీ, ఈడీలు కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రామానుజ సేవా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ జీవీ ధనుంజయ్, జీఎంలు సుబ్రమణ్యం, సంతోష్‌కుమార్, డీజీఎంలు రాజ్ కుమార్, నాగేశ్వరరావు, వినోద్‌కుమార్, మేనేజర్లు కల్యాణి, భాను చందర్, జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

ఎంపీ ఎం.అనిల్‌కుమార్‌యాదవ్

చిక్కడపల్లి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ ఎలాంటి తప్పులు దొర్లకుండా కుటుంబాల వివరాలను సేకరించాలని సూచించారు. గురువారం గాంధీనగర్ డివిజన్‌లోని ఎస్ఆర్టీ క్వార్టర్స్‌లో చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించి ఆయన మాట్లాడారు. సర్వేపై అపోహలు వద్దని, వివరాలు గోప్యంగా ఉంటాయని ప్రజలంతా తగిన సమాచారం ఇవ్వాలన్నారు. సర్వేతో సమాజంలో గొప్పమార్పు చోటు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు గుర్రం శంకర్, అభిషేక్ కెనడీ, శీలం సత్యనారాయణ, మరిశెట్టి నర్సింగ్‌రావు పాల్గొన్నారు.



ఎస్ఆర్టీక్వార్టర్స్‌లో సర్వే దరఖాస్తులను మహిళలకు అందజేస్తున్న ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్

మత్స్యకారులకు కొరవడిన ప్రోత్సాహం

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

పంజగుట్ట: జనాభాలో అధిక సంఖ్యలో ఉన్న మత్స్యకారులు అన్ని రంగాల్లో రాణించేందుకు ఏ పార్టీ ప్రోత్సహించడం లేదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చొప్పరి శంకర్ ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఈటల మాట్లాడుతూ... ముదిరాజ్, బంటు, ముత్తరాసి, గంగపుత్ర, బెస్త, గోండు ఇలా కులాల పేర్లు ఏదైనా నీళ్లని నమ్ముకుని చేపలు పట్టే వృత్తిని నమ్ముకుని బతికే కులాలు అన్నారు. మనిషికి ఆరోగ్యాన్ని, ఎదుగుదలను, తెలివితేటలను ఇచ్చేది మత్స్య సంపద అని కోటానుకోట్ల మంది ప్రజలకు మంచి ఆహారాన్ని అందించే వారు మత్స్యకారులన్నారు. యాదవులకు, గీత కార్మికులకు, చేనేత కార్మికులకు వృత్తిలో ఉంటే సభ్యత్వం వస్తుందని, కాని వృత్తిలో ఉండి కూడా సభ్యత్వం పొందని జాతి మత్స్యకారుల జాతి మాత్రమే అన్నారు పార్లమెంట్ స్టాండింగ్ కమిటీలో ఎంపీలకు సభ్యత్వం ఉంటుందని, యానిమల్, హస్బండ్రీ అండ్ ఫిషరీస్‌లో తాను సభ్యత్వం అడిగి తీసుకున్నానని తెలిపారు. చొప్పరి శంకర్ మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం మత్స్యకారులకు రక్షణ చట్టం తీసుకొచ్చి మత్స్యకారులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. మహాసభ ప్రధాన కార్యదర్శి శివయ్య ముదిరాజ్, మద్దెల సంతోష్, కరుణాకర్, వి.కె.మహేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ నాగేశ్వర్‌రావు తెలిపారు. బౌద్ధనగర్ ఫీడర్ పరిధిలోని వారాసిగూడ, కౌసర్‌మజీద్, జామైఉస్మానియా, బాలాజీ కమ్యూనిటీహాల్ తదితర ప్రాంతాలలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు.. జామై ఉస్మానియా ఫీడర్ పరిధిలోని ఎస్‌బీహెచ్‌కాలనీ, లలితానగర్, అడిక్‌మెట్ ఫ్లైఓవర్ తదితర ప్రాంతాలలో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు... ఆజామాబాద్ ఫీడర్ పరిధిలోని రాంనగర్, శ్రీనివాస టెక్స్‌టైల్, గరుండా అపార్టుమెంట్, ఆజామాబాద్ తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు, రాంనగర్ ఫీడర్ పరిధిలోని టీఆర్‌టీ క్వార్టర్స్, రెడ్డి ఆయిల్ మిల్, రాంనగర్ తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి

ముషీరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి సమస్యలను వివరించి న్యాయం జరిగేలా బాధ్యతాయుతంగా పని చేస్తానన్నారు. గురువారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా మహాత్మానగర్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు బిజ్జి కనకేష్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు ఆయనను కలిసి సమస్యలను వివరించారు. అనంతరం మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ.. మత్స్యకారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఫిషరీస్ ఫెడరేషన్ డైరెక్టర్ నాగమణి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మహాత్మానగర్ గంతపుత్ర సంఘం నూతన కమిటీ

ముషీరాబాద్: మహాత్మానగర్ గంగపుత్ర సంఘం నూతన కమిటీ అధ్యక్షుడిగా బీజేపీ నేత బిజ్జి కనకేష్‌కుమార్ రెండోసారి నియమితులయ్యారు. గురువారం మహాత్మానగర్‌లోని సంఘం కార్యాలయంలో కమిటీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బిజ్జి కనకేష్‌కుమార్ మాట్లాడుతూ.. గంగపుత్రులను ఏకతాటిపైకి తీసుకొచ్చి తమ డిమాండ్ల సాధనకు కృషి చేస్తున్నామని అన్నారు.

రామ్‌చరణ్ హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలి

అయ్యప్ప జేఏసీ కన్వీనర్ నాయిని బుచ్చిరెడ్డి



నల్లకుంట: అయ్యప్ప దీక్షలో ఉండి దీక్షా నియమాలకు విరుద్ధంగా అందరి సమక్షంలో బొట్టు చెరిపేసుకుని ఓ దర్గాను సందర్శించిన హీరో రామ్‌చరణ్ హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పాలని అయ్యప్ప జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) కన్వీనర్ నాయిని బుచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నల్లకుంటలో ఆయన మాట్లాడుతూ.. ఓ సంగీత దర్శకునికి మాట ఇచ్చారని అయ్యప్ప దీక్షలో దర్గాకు వెళ్లడం సరికాదన్నారు. సెలబ్రిటీలు మాలధారణ చేయడం సంతోషకరమని కానీ గురుస్వాముల సూచనలు కూడా పాటించాలని సూచించారు. అయ్యప్ప దీక్ష నియమాలు పాటించని రామ్‌చరణ్ వెంటనే అయ్యప్ప మాల తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. వారం రోజుల్లో రామ్‌చరణ్ స్పందించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

23న పుస్తకావిష్కరణ

లిబర్టీ: 'విజయ గాథ నిశబ్ద శబ్ద తరంగం' పుస్తకాల ఆవిష్కరణ సభ నిర్వహించనున్నట్లు బొజ్జ తారకం బోయి విజయభారతి స్మారక సంచిక కమిటీ కన్వీనర్ సజియ, ట్రస్ట్ కో కన్వీనర్ గనుముల జ్ఞానేశ్వర్ తెలిపారు. శనివారం సాయంత్రం తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ సమావేశం మందిరంలో ఆవిష్కరణ సభ జరుగుతుందని ఒక ప్రకటనలో తెలిపారు. పుస్తకావిష్కరణ సభకు ముఖ్య అతిథులుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, విశ్రాంత ఐఏఎస్ అధికారి కాకి మాధవరావు, ప్రొఫెసర్ రమా మెల్కోటె విశిష్ట అతిథులుగా జస్టిస్ చంద్రయ్య, ప్రముఖ పత్రికా సంపాదకులు సతీష్‌చందర్, డాక్టర్ సునీత, రాణి, జోష్న, ప్రొఫెసర్ మహితా బొజ్జ గడ్డం ఝాన్సీ తదితరులు పాల్గొంటారన్నారు.

27న ప్రేయర్ డేను విజయవంతం చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఈనెల 27న ఎల్బీ స్టేడియంలో ప్రేయర్ డేను నిర్వహించనున్నట్లు పలువురు క్రైస్తవులు పేర్కొన్నారు. ఓయూ జేఏసీ చైర్మన్ గడ్డం అశోక్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ ఎదుట గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలనే ఉద్దేశంతో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ప్రేయర్ డే కార్యక్రమానికి విద్యార్థులు,అధ్యాపకులు, ఉద్యోగులు హాజరుకావాలని కోరారు.

హాస్టల్ సమస్యలు పరిష్కరించాలని వినతి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో హాస్టల్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలువురు విద్యార్థులు జార్జిరెడ్డి పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో తన కార్యాలయంలో చీఫ్ వార్డెన్ కొర్రెముల శ్రీనివాస్‌రావుకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెస్‌లో నాణ్యతపై దృష్టిపెట్టాలని, హాస్టల్స్‌ను, భోజనశాలలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాగేశ్వర్ రావు, సుమంత్ పాల్గొన్నారు.

పాసింగ్ ఔట్ పరేడ్ @ అంబర్‌పేట్

● 9 నెలల ఇండోర్, అవుట్‌డోర్ శిక్షణ ● శిక్షణ పూర్తి చేసుకున్న 768 మంది

అంబర్‌పేట: అంబర్‌పేట పోలీస్ శిక్షణ కేంద్రంలో 2024 బ్యాచ్ కానిస్టేబుళ్ల శిక్షణ ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా సీఐడీ డీజీపీ శిఖాగోయల్ విచ్చేసి పాసింగ్‌ఔట్ పరేడ్‌లో గౌరవ వందనం స్వీకరించారు. కళాశాల ప్రిన్సిపాల్ పరవస్తు మధుకర్‌స్వామి మాట్లాడుతూ.. ఇక్కడి శిక్షణ కేంద్రంలో 768 మంది అభ్యర్థులు 9నెలల పాటు ఇండోర్, అవుట్‌డోర్ శిక్షణ పొందారని అన్నారు. ప్రతి ఒక్కరూ చక్కని ఉత్తీర్ణత సాధించారని ఆయన స్పష్టం చేశారు. 1939 నుంచి ఇక్కడి శిక్షణ కేంద్రంలో ఎంతో మందికి శిక్షణ ఇచ్చామన్నారు.

అభ్యర్థుల కుటుంబీకుల సందడి....

అంబర్‌పేట పీటీసీలో జరిగిన పోలీస్ పాసింగ్ పరేడ్ సందడిగా జరిగింది. వందలాది మంది అభ్యర్థుల కుటుంబసభ్యులు తరలివచ్చారు. కుటుంబసభ్యులు శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులను చూసి మురిసిపోయారు. తామ వాడు పోలీస్ అయ్యాడని గర్వపడ్డారు. సర్వాంగా సుందరంగా అలంకరించిన ప్రాంగణంలో కుటుంబసభ్యులతో కలసి శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులు ఫొటోలు దిగారు. తొటి అభ్యర్థులు, శిక్షణ ఇచ్చిన అధికారులతో ఫొటోలు తమ ఫోన్లలో పదిలపరచుకున్నారు.








అంబర్‌పేట పీటీసీలో జరిగిన పాసింగ్ ఔట్ పరేడ్‌లో గౌరవవందనం స్వీకరిస్తున్న సీఐడీ డీజీపీ శిఖాగోయల్



శిక్షణ ముగింపులో కుటుంబ సభ్యులతో ఫొటో తీసుకుంటున్న అభ్యర్థులు

